పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

నర్సాపూర్(జి), మే 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని డీపీవో శ్రీనివాస్ సూచించారు. మండలంలోని రాంపూర్ పంచాయతీని మంగళవారం సందర్శించారు. పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం శానిటేషన్, షెడ్, నర్సరీలను పరిశీలించారు. వన మహోత్సవానికి మొక్కలను సంరక్షించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నవనీత్ కుమార్, కారోబార్ గంగారాం, ఫీల్డ్అసిస్టెంట్ ఉన్నారు.

ముగిసిన భూ భారతి.. గ్రామ సభలు!


కుంటాలలో భూ భారతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి (ఫైల్)


కుంటాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిర్మల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతిని అమలు చేయబోతున్న నేపథ్యంలో ఈ పోర్టల్ అమలు కోసం మొదట జిల్లాలోని కుంటాల మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలను తెలుసుకోవాల్సి ఉంది. అయితే మొత్తం 16 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో గ్రామసభలన్నీ ముగిసినట్లేనని చెబుతున్నారు. అధికారులు మొత్తం మండలంలో మూడు బృందాలుగా ఏర్పడి 16 రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రతీ బృందానికి తహసీల్దార్ టీం లీడర్‌గా వ్యవహరించారు. కాగా ఇప్పటి వరకు మొత్తం 16 రెవెన్యూ గ్రామాల్లో 582 దరఖాస్తులు రాగా సంబంధిత అధికారులు అక్కడికక్కడే 105 దరఖాస్తులను పరిష్కరించారు. ముఖ్యంగా సాదా బైనామాల పైనే ఆయా గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అయితే ఈ సాదా బైనామాలపై కోర్టుల్లో కేసులున్న కారణంగా వాటిని పక్కన పెట్టారు. ఇదిలా ఉండగా పైలెట్ ప్రాజెక్టుగా కుంటాల మండలంలో అమలు చేసిన భూ భారతి కార్యక్రమ ప్రక్రియను అధికారులు విశ్లేషిస్తున్నారు. జూన్ మొదటి వారం నుంచి జిల్లా వ్యాప్తంగా భూ భారతి కార్యక్రమం అమలు కాబోతున్న నేపథ్యంలో ఈ విశ్లేషణ ఎంతో ఉపయోగపడనుందని అంటున్నారు. కుంటాల మండలంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల సమస్యలను క్రోడీకరించి అన్ని మండలాల్లో దాదాపుగా ఇలాంటి సమస్యలే రావచ్చని అధికారులు భావిస్తున్నారు. దీనికి అనుగుణంగానే ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. కాగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కుంటాల మండలంలో జరిగిన గ్రామసభలను జిల్లా ఉన్నతాధికారులంతా సీరియస్‌గా పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు అడిషనల్ కలెక్టర్‌లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవో తదితరులు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

- పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన కుంటాల మండలం
- 16 రెవెన్యూ గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ
- 582 దరఖాస్తులపై కసరత్తు
- సాదా బైనామాలపైనే పంచాయితీలు


భూ భారతిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అన్నీ సాదా బైనామాలే...

కాగా దశాబ్దాల నుంచి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సాదా బైనామాల వ్యవహారమే కుంటాల గ్రామసభల్లో ఎక్కువగా చర్చకు వచ్చింది. గతంలో ప్రభుత్వాలు సాదా బైనామాలకు మోక్షం కల్పిస్తామంటూ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ధరణి పోర్టల్ ద్వారా సాదా బైనామాల వ్యవహారం కనుమరుగైంది. జిల్లా వ్యాప్తంగా సాదా బైనామాలతో చాలా మంది భూములను తమ ఆధీనంలో ఉంచుకున్నారు. అయితే చాలా చోట్ల సాదా బైనామాల వ్యవహారం చట్టబద్ధత లేని కారణంగా వివాదాలను రేకెత్తించింది. ఈ సాదా బైనామాల వ్యవహారాలు కోర్టు కేసుల్లో ఉన్నాయి. అధికారులు కోర్టు కేసుల కారణంగా కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. అయితే భూ భారతి ద్వారా సాదా బైనామాలకు మోక్షం లభించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతుండడంతో అన్ని గ్రామసభల్లో దీనికి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వచ్చాయి. కుంటాల మండలంలో 500లకు పైగా దరఖాస్తులు వస్తే ఇందులో నుంచి 150 సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులే ఉండడం విశేషం.

జూన్ మొదటి వారం నుంచి జిల్లా అంతటా అమలు

జూన్ మొదటి వారం నుంచి జిల్లా అంతటా భూ భారతిని అమలు చేయబోతున్న కారణంగా కుంటాల మండలంలో జరిగిన ఈ గ్రామసభలు ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. ఇక్కడ ఎదురైన అనుభవాలన్నింటిని జిల్లా వ్యాప్తంగా క్రోడీకరించి వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోబోతున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పకడ్బందీ ప్రణాళికను రూపొందించారు. రాబోయే జూన్ నుంచి జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూ భారతి గ్రామసభలు నిర్వహించి భూముల సమస్యలను పరిష్కరించనున్నారు. భూముల సరిహద్దులు, తప్పుడు సర్వే నెంబర్‌ల నమోదులతో పాటు మిగతా వ్యవహారాలన్నింటిని ఈ భూ భారతి ద్వారా పరిష్కరించనున్నారు. ప్రభుత్వం భూ భారతిని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో అధికారులు సీరియస్‌గా చర్యలు తీసుకోబోతున్నారు.

ఇక భూముల వివరాలు పక్కా

భూ భారతి పోర్టల్ ద్వారా అవకతవకలకు తావు లేకుండా భూ వివరాలన్నీ పక్కాగా నమోదు కాబోతున్నాయి. ప్రభుత్వ భూముల లెక్కలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ దృష్టి సారించడమే కాకుండా ఆ దిశగా సర్వే చేపట్టి భూములను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఆక్రమణలో ఉన్న దాదాపు వంద ఎకరాల ప్రభుత్వ భూములను అధికారులు గుర్తించారు. మరో 300 ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమార్కుల నుంచి వెలికి తీసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. దీంతో పాటు చాలా ప్రైవేటు భూముల విషయంలో కూడా తప్పుడు రికార్డులు నమోదు కావడం అలాగే సరిహద్దులు, సర్వే నెంబర్‌ల లాంటి వివాదాలు కొనసాగుతున్నాయి. భూ భారతి ద్వారా ఇలాంటి వివాదాలన్నింటికీ చెక్ పడనుందంటున్నారు. పకడ్బందీగా రికార్డుల రూపకల్పన జరగనుందని పేర్కొంటున్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల్లోని తప్పులను సవరించే అధికారాన్ని సంబంధిత తహసీల్దార్‌లకు అప్పగించబోతున్నారు. దీంతో ఎప్పటికప్పుడు తప్పుల సవరణకు అవకాశం ఏర్పడనుందంటున్నారు.


కుంటాల తహసీల్దార్ కార్యాలయం

ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని ప్లాస్టిక్ తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, ఇది మానవాళి ఆరోగ్యానికి మాత్రమే కాకుండా ఇతర జీవరాశులకు కూడా ముప్పుగా మారిందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్‌వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మహిళా స్వయం సహాయక సంఘాల సహకారంతో ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. పంచాయతీ స్థాయిలో ప్లాస్టిక్ నిషేధానికి అనుగుణంగా తీర్మానాలు చేయాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వస్తువులను వేరుగా సేకరించి సెగ్రిగేషన్ చేయాలని, కలెక్టరేట్‌లో ఇప్పటికే స్టీల్ నీళ్ల సీసలను వినియోగంలోకి తీసుకొచ్చామని వివరించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల తయారీ, విక్రయంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘించిన వారికి జరిమానాలు, వ్యాపారలైసెన్స్‌లను రద్దు చేయడం సహా చట్టపరమైన చర్యలకు వెనుకాడరాదని అధికారులను హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్న సంస్థలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామసభలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచాలన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్, పేపర్ సంచుల తయారీ కేంద్రాలను మహిళా సంఘాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు రత్నా కళ్యాణి, కోమల్ రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్నాడన్న అనుమానం...

పోలీసుల అదుపులో యువకుడు

- గ్రామానికి వచ్చిన ఎస్పీ
- ప్రజలకు కౌన్సెలింగ్


గుండంపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

దిలావర్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్నాడన్న అనుమానంతో గుండంపల్లిలో ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని గుండంపల్లి గ్రామానికి బతుకుదెరువు కోసం వచ్చిన యువకుడు గంజాయి విక్రయిస్తున్నాడన్న అనుమానంతో అదే గ్రామానికి చెందిన కొందరు 8712659599 నెంబర్‌కు ఫోన్‌చేశారు. వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ డా.షర్మిల గుండంపల్లి చేరుకున్నారు. ఆ వెంటనే నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, నర్సాపూర్(జి) ఎస్సై సాయికిరణ్‌లు గుండంపల్లికి చేరుకున్నారు. ఎస్పీ జానకిషర్మిల గ్రామస్థులను విచారించిన అనంతరం అనుమానిత యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ డా.జానకి షర్మిల మాట్లాడుతూ... ఎవరు గంజాయి విక్రయించినా, తాగినా 8712659599 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు రహస్యంగా ఉంచుతామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని, గంజాయి వ్యసనం చాలా ప్రమాదకరమన్నారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి అమ్మినా, తాగినా కఠినంగా శిక్షిస్తామన్నారు. మత్తుపదార్థాలను సేవించి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని యువకులకు సూచించారు. ఫోన్ కాల్‌కు వెనువెంటనే స్పందించి గ్రామానికి వచ్చిన ఎస్పీ జానకి షర్మిలను పలువురు అభినందిస్తున్నారు. ఇలా స్పందిస్తేనే పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందని, తద్వారా నేరాలను అదుపు చేయడం సులువు అవుతుందన్నారు.

లోక్‌అదాలత్ నిర్వహణపై ఎస్పీ సమీక్ష

నిర్మల్ కల్చరల్ : నిర్మల్ జిల్లాలో జూన్ 14న జరిగే లోక్ అదాలత్ లపై ఎస్పీ జానకి షర్మిల మంగళవారం ఆన్‌లైన్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థాయిలో కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై చర్చించారు. మధ్యస్థులుగా ఎంపికయ్యేవారు సమాజానికి సేవ చేసి ఉండాలని, పేరుగల ప్రజా విశ్వాసం గలవారు ఉండాలని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, గ్రామపెద్దలు కమిటీలో ఉండవచ్చునని తెలిపారు. ప్రజలను భాగస్వాములుగా చేయడంతో గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొంటుందన్నారు. 14 జూన్‌లో జరిగే లోక్ అదాలత్ దృష్టిలో పెట్టుకొని ఇప్పటి వరకు పరిష్కరించిన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, అవినాష్ కుమార్, రాజేష్ మీనా, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై రైతుల బైఠాయింపు


రైతులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్, పోలీసులు

మామడ, మే 20 (ఆంధ్రజ్యోతి) : రైతులను తరుగు పేరుతో నిండా ముంచుతున్నారని ఖానాపూర్ మండలంలోని రాజుర గ్రామానికి చెందిన రైతులు మంగళవారం మామడ మండలంలోని జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరి కొనుగోలు కేంద్రంలో తేమ పేరుతో బస్తాకు నాలుగుకిలోల చొప్పున అధికంగా జోకుతున్నారని అధికారులకు, కొనుగోలు కేంద్రం యాజమాన్యానికి చెప్పిన పట్టించుకోవడం లేదని దానికి నిరసనగా రోడ్డుపై బైఠాయించామని నినాదాలు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర కన్నా తరుగు పేరుతో అధికంగా నిండా ముంచుతున్నారని ఆరోపించారు. సంఘటన స్థలానికి మామడ ఎస్సై అశోక్ చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలపడంతో రైతులు వెళ్లిపోయారు.

మహిళను కాపాడిన కానిస్టేబుల్


మహిళను రక్షించిన కానిస్టేబుల్ మోహన్

బాసర, మే20(ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద గోదావరినదిలో మంగళవారం ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఓ మహిళను కానిస్టేబుల్ మోహన్‌సింగ్ కాపాడారు. ముథోల్ మండల కేంద్రం మోచిగల్లికి చెందిన లక్ష్మీ ఇంట్లో గొడవలతో మనస్తాపం చెంది మంగళవారం బాసర గోదావరి నదీ తీరంలో మొదటి ఘాటు వద్ద అనుమానాస్పద స్థితిలో తిరుగుతుంది. అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ మోహన్‌సింగ్ అనుమానంతో విచారణ చేయగా ఆత్మహత్య విషయం తెలిపింది. ఇంట్లో తమ్ముడు మరదలు ఇబ్బంది పెట్టడంతో భరించలేక ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకున్నట్లు లక్ష్మీ విలపించింది. పోలీసులు లక్ష్మిని ఓదార్చి, కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

నల్లమట్టి తరలింపును అడ్డుకున్న అధికారులు

- 9 ట్రాక్టర్లు, రెండు జేసీబీల సీజ్


సీజ్‌చేసిన జేసీబీతో అధికారులు

ఖానాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది రోజులుగా కడెం రిజర్వాయర్ ఎగువ ప్రాంతమైన ఖానాపూర్ మండలంలోని బీర్నంది, సిర్పూర్ ప్రాంతాల నుంచి కొంతమంది వ్యక్తులు నిర్వహిస్తున్న నల్లమట్టి తరలింపును మంగళవారం ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కడెంప్రాజెక్టు ఏఈఈ నితిన్ ఈ స్థలాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన తనిఖీ చేసిన సమయంలో మూడుజేసీబీలు, 15 ట్రాక్టర్ల వరకు ఘటనా స్థలంలో ఉన్నట్లు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి నల్లమట్టిని తరలిస్తున్నందున నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. రెండు జేసీబీలు సహా 9 ట్రాక్టర్లను సీజ్‌చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ట్రాక్టర్లు, జేసీబీల యజమానులపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇదివరకే కడెం ప్రాజెక్టు పూడికతీతకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయినందున ప్రాజెక్టు నుంచి అనుమతి లేకుండా ఎవరు మట్టిని తీయవద్దన్నారు. కాగా కొంతమంది వ్యాపారులు ఈ ప్రాంతంలోని నల్లమట్టిని జగిత్యాల జిల్లాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మట్టిని తరలించేందుకు ట్రాక్టర్లతో సహా టిప్పర్లను సైతం వినియోగిస్తూ లక్షల రూపాయలను కొల్లగొడుతున్నట్లు చెబుతున్నారు. గత వారం రోజులుగా ఈ నల్ల మట్టి దందా నడుస్తున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

వారం రోజుల తర్వాత స్పందించిన ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా పకడ్బందీ చర్యలు చేపట్టి ఈ ప్రాంతంలోని మట్టి ఇక్కడి రైతులకు మాత్రమే ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు. పక్క జిల్లా అయినా జగిత్యాలకు మట్టిని తరలించడం ద్వారా ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తున్నందున స్థానికంగా రైతులకు నల్లమట్టి కావాలన్న అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తండ్రి పైశాచిక చర్యకు పసికందు మృతి

- శిశువుపై పడుకోవడంతో ఊపిరాడక మృతి
- ఖానాపూర్‌లో విషాదం
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు


పసికందు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖానాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై బాధ్యతను మరిచిన ఓ తండ్రి పైశాచిక చర్యకు 28 రోజుల పసికందు ప్రాణాలు కోల్పోయిన హృదయవిదారకమైన ఘటన ఖానాపూర్ పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ సీఐ అజయ్ తెలిపిన కథనం ప్రకారం... పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఆలకుంట శేఖర్ సుజాత అనే దంపతులకు 28 రోజుల క్రితం కూతురు జన్మించింది. కాగా సుజాత అదే కాలనీలోని తన తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. ఇటీవల కాలంలో మద్యం తాగి అత్తగారింటికి వెళ్లిన శేఖర్ తన భార్యను తనతో పంపమని తరచూ గొడవ పడుతుండేవాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున తన 28 రోజుల పసికందుతో కలిసి సుజాత ఇంట్లో మంచంపై పడుకుంది. తెల్లవారుజామున ఐదుగంటల ప్రాంతంలో సుజాత ఇంటికి వెళ్లిన ఆమె భర్త శేఖర్ పసికందుతో కలిసి సుజాత పడుకున్న మంచంపై పడుకున్నాడు. పసిపాప మంచంపై ఉందని తెలిసి కూడా నిర్లక్ష్యంగా శేఖర్ ఆ పాపపై పడుకోవడంతో ఊపిరాడక ఆ చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. ఈ మేరకు సుజాత తల్లి అల్లెపు రాజమణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సిహెచ్. అజయ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్‌లు తెలిపారు. పైశాచికంగా వ్యవహరించి 28 రోజుల పసికందు మరణానికి కారణమైన తండ్రి శేఖర్‌పై స్థానికులు మండిపడుతున్నారు.

'నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి'

కుంటాల, మే, 20 : (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో నెలకొని ఉన్న పరిస్థితుల దృష్ట్యా మంగళవారం జరగవలసిన సార్వత్రిక సమ్మెను జూలై 9న నిర్వహించనున్నట్లు టీయూసీఐ జిల్లా అధ్యక్షులు బక్కన్న పేర్కొన్నారు. సమ్మెను వాయిదా వేసి స్థానికంగా నిరసనలు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం కుంటాల మండలంలోని కల్లూరు బీడీ ఫ్యాక్టరీ ఎదుట టీయూసీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా బక్కన్నతో పాటు జిల్లా కార్యదర్శి రాంలక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు నిరసిస్తూ కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్మికులను కట్టుబానిసలుగా చేసే నాలుగులేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస పెన్షన్ 9 వేల రూపాయల అమలు చేయాలన్నారు. పంటలకు కనీస మద్దతు ధరచట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కుభీర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్లగొండ గ్రామ పంచాయతీలో గల తాగు నీటి సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజన్న ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగు నీటి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మోరాయించిన మోటర్లను మరమ్మత్తులు చేయించి గ్రామంలో తాగు నీటి సరఫరా పునరుద్ధరించారు. మంచినీటి కులాయిల వద్ద మినీ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసి తాగు నీటి వనరుల వద్ద మురికి నీరు చేరకుండా చర్యలు చేపట్టారు.

కరెంట్ షాక్‌తో ఒకరి మృతి

భైంసా రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుంక్లి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సుంక్లి గ్రామానికి చెందిన అరిగెల ముత్యం(45) తన లాండ్రీ షాప్‌లో బట్టలను ఇస్త్రీ చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే భైంసా ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వైద్యులు మృతి చెంది ఉన్నాడని నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు నమూనాకి భూమి పూజ

కడెం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ శాసన సభ సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంగళవారం కడెంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు, కడెం తహసీల్దార్, ఎంపీడీవోల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల నమూనా నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి పడిగెల భూషణ్, ఏఎంసీ చైర్మన్ శైల రమేష్ రావు, పీఏసీఎస్ చైర్మన్ కడెం మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, సతీష్ రెడ్డి, వాజీద్ ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు వరించిన వారికి సన్మానం

దిలావర్‌పూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవులు వరించిన నాయకులను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం శాలువాతో సత్కరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాయన్న, ఆత్మ డైరెక్టర్లు లోలం శ్రీహరి, సిర్గాపూర్ రవి, కాల్వ దేవస్థానం చైర్మన్ అంగూర్ మహేందర్‌లు పదవులు స్వీకరించి మొదటిసారి దిలావర్‌పూర్ మండల కేంద్రానికి వచ్చారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కం రాజారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాజారెడ్డి ఇతర కాంగ్రెస్ కార్యకర్తలు రమణ, సి. ముత్యం, కోడె శ్రీనివాస్, తదితరులు వారిని శాలువాతో సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసా, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ సరిహద్దులోని నాందేడ్ క్రాస్ రోడ్డు సమీపంలో గల పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యువాతపడ్డారు. భైంసా మండలంలోని వాలేగాం గ్రామానికి చెందిన అచ్యుత్‌రావ్ పాటిల్ (46) అనే వ్యక్తి స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై భైంసాకు వస్తుండగా ప్రమాదం బారిన పడి మృతి చెందాడు. వాలేగాం నుంచి భైంసాకు వస్తున్న అచ్యుత్‌రావ్ పాటిల్ ద్విచక్ర వాహనం, అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పెట్రోల్ బంక్ నుంచి రోడ్డు మార్గం పైకి వస్తుండగా ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకోవడంతో ఘటన చోటు చేసుకున్నట్లుగా ప్రమాదస్థలిలోని స్థానికులు తెలిపారు. ఇందులో అచ్యుత్‌రావ్ పాటిల్ తలకు తీవ్ర గాయమై అపాస్మరక స్థితికి చేరుకోగా ఘటన స్థలి నుంచి ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లుగా తెలిసింది. మృతుడు అచ్యుత్‌రావ్ పాటిల్‌కు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భైంసా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

ఎమ్మెల్సీ విజయశాంతిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు

నిర్మల్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ శాసన మండలి సభ్యురాలు విజయశాంతిని హైదరా బాద్ లోని ఆమె నివాసంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు మంగ ళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజే శారు. రాష్ట్రంలో ప్రజా ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ మే లక్ష్యంగా పని చేయాలన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య మెళకువలు

నిర్మల్ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆరోగ్య మెళకువలు నేర్పించాలని ఫిజియోథెరపిస్ట్ కత్తి కిరణ్ అన్నారు. మంగళవారం విజయ హైస్కూల్ ఉపాధ్యాయ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా సరైన పద్ధతుల్లో వ్యాయామంపై శిక్షణ ఇవ్వాలన్నారు. చరవాణి చూడటంతో జరిగే అనర్థాలు, నిద్రపోయే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు అందించారు. కోర్స్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, డీఆర్పీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

సోన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రైతుకు గుర్తింపు కార్డు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సుంచు సవీన్ అన్నారు. సోమన్ మండలం సాకెర గ్రామంలో మంగళవారం ఫార్మర్ ఐడీ కార్డు కోసం రైతుల నుంచి వ్యవసాయ విస్తరణ అధికారి ప్రగతి వివరాలను నమోదు చేసుకున్నారు. భూమి ఉన్న రైతులందరూ మొబైల్ నెంబర్ జతపరిచిన ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ పత్రాలతో వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. గుర్తింపుకార్డులు ఉన్న రైతులకు సంక్షేమ పథకాలు అమలు అవుతాయని తెలిపారు. ఇందులో నాయకులు పోశెట్టి, నరేష్, లక్ష్మణ్, తదితరులున్నారు.

సర్కార్‌బడుల

బలోపేతానికి శిక్షణ : ఎంఈవో

నర్సాపూర్(జి), మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు ఐదురోజుల ఎఫ్ఎల్ ఎన్ శిక్షణ ప్రారంభించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించి, వారి విద్యా ప్రమాణాలు పెంచాలని ఎంఈవో, కోర్సు డైరెక్టర్ వై.సాయన్న సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు పిలు పునిచ్చారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం పురుషోత్తం, ఆర్పీలు, మండ లంలోని ఎస్‌జీటీలు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయులు నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి'

నిర్మల్ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు శిక్షణల ద్వారా బోధన నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన నిర్మల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని నారాయణ హైస్కూల్‌ల్లో సందర్శించారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా మారి కాలానుగుణంగా బోధన విధానాలు తెలు సుకోవాలన్నారు. ప్రభుత్వం అందుకోసమే శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు.

'అక్రమ కేసులతో ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు'

ఖానాపూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షాలపై అక్రమ కేసులతో ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ ఖానాపూర్ మండల అధ్యక్షులు తాళ్లపెల్లి రాజగంగన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత అసెంబ్లీ ఎన్నికల వేళ తమ నాయకుడు జాన్సన్ నాయక్‌ను మండలంలో కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని నానా రభస చేశారన్నారు. అయినప్పటికీ జాన్సన్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయకుండా తన ఔన్నత్యాన్ని ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్,మాజీ ఎంపీపీ అబ్దుల్ మోహిద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, ఖానాపూర్ మాజీ ఉప సర్పంచ్ సుమన్ పాల్గొన్నారు.

ఉట్నూర్: అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి పాలు అవుతామన్న భయంతోనే బీఆర్ఎస్ నాయకుల పై కేసులు పెడుతున్నారని ఉట్నూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పంద్రాజయవంతరావు ఆరోపించారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు నిరసిస్తూ నల్ల బ్యాడ్జిలు ధరించి విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాటం రమేష్, సింగరేభారత్‌పాల్గొన్నారు.

సిరికొండ రూరల్ : ప్రజలకు అందుబాటులో ఉంటున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ పై అకారణంగా అధికార పార్టీ నాయకులు కేసు నమోదు చేయడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతగాక అక్రమంగా బీఆర్ఎస్ నాయకులపై కేసులు బనాయిస్తున్నారని ఆయన విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి : భూక్యా జాన్సన్ నాయక్‌పై అక్రమ కేసు నమోదు చేయడం సరికాదని, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ ఆరోపించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన నందే నందినికి మంజూరు అయిన రూ. 43 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. అనంతరం నిర్మల్ జిల్లా సారంగపూర్ మండల సేవానగర్ వాసులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆహ్వాన పత్రికను అందజేసిన సారంగపూర్ మండలంలోని సేవానగర్ గ్రామంలో ఈనెల 27, 28వ తేదిల్లో జరిగే శ్రీ జగదాంబదేవి రాంరావు మహారాజ్ విగ్రహ, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరు కావాలని సేవానగర్ గ్రామస్తులు, సేవాలాల్ యూత్ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతంరెడ్డి, సవాయి, రమేష్, నజీర్, రాజు, భరత్, వసంత్‌రావు, తదితరులు ఉన్నారు.

రైతుల ఆత్మహత్యలు బాధాకరం

● మాజీ మంత్రి జోగు రామన్న



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి) : రైతుల ఆత్మహత్యలపై ప్రభుత్వానికి పట్టింపు లేదని, అన్నదాతల ఆత్మహత్యలు పెరిగిపోవడం బాధకరమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోకుండా ఆత్మ స్థైర్యంతో ఉండాలని కోరారు. సాత్నాల మండలంలోని సుందరిగి గ్రామానికి చెందిన కొప్పుల లచ్చన్న అనే రైతు ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి పరామర్శించారు. అప్పుల బాధతో తీవ్ర మనస్తాపానికి గురై రైతు ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులను కలిసి అధైర్య పడవద్దు అని ధైర్యాన్ని కల్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు సైతం అందకపోవడం రైతుని తీవ్రంగా కలిచివేసిందన్నారు. దిక్కుతోచని స్థితిలో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆత్మస్థైర్యంతో ఉండాలని, అన్నం పెట్టె అన్నదాత ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు విడవడం మంచిది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతు కుటుంబాల్లో తీవ్ర సంక్షోభం ఏర్పడే రైతు ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. రైతులు ఎవరు అధైర్య పడకుండా ముందుకు సాగాలని కోరారు చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ దేవన్న, సర్పంచ్ నర్సింగ్, పోచ్చన్న, కిష్టన్న, సంతోష్, పోతన్న, మునప్, కుమ్ర రాజు, ఉగ్గే విఠల్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

● ఎన్‌హెచ్ అధికారులతో ముథోల్ ఎమ్మెల్యే రామారావ్



జాతీయ రహదారి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భైంసా, మే 20 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ నుంచి తానూర్ మండలంలోని బెల్‌తరోడ వరకు గల జాతీయ రహదారి మార్గంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జాతీయ రహదారి 61 పీడీ శ్రీనివాసరావు, ఐఈ టెక్నికల్ లీడర్ రణవీర్ సింగ్, ఆర్ఈ సురేంద్రలతో కూడిన అధికారుల బృందం ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌తో బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడుతూ.. ఇక్కడి ప్రాంతంలోని జాతీయ రహదారి మార్గంలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతుండగా, మరెందరో అంగవైకల్యం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వరకు గల జాతీయ రహదారిపై చోటు చేసుకొని రోడ్డు ప్రమాదాలు ఇక్కడి జాతీయ రహదారిపై జరుగుతుండడానికి గల కారణాలపై విశ్లేషణ జరిపి నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఇదే క్రమంలో నిర్మల్ నుంచి బెల్‌తరోడ వరకు గల జాతీయ రహదారి మార్గంలోని ప్రతీ గ్రామం వద్ద నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలను పూర్తి స్థాయిలో నివారించేందుకు సత్వరమే అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు ఉంచాలి

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్,మే20 (ఆంధ్రజ్యోతి):రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను డీలర్లు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ రిటైలర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పీఓఎస్ పరికరాలు, స్టాక్ లిక్విడిటేషన్ వినియోగం తదితర వాటి పై చర్చించారు. కొత్త ఎల్‌వన్ ఈపాస్ యంత్రాలను డీలర్లకు కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని, బ్లాక్ మార్కెటింగ్ చేయడం, ఇతర రాష్ట్రాల వారికి అమ్మడం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈపాస్ యంత్రాల ద్వారా ఎరువుల అమ్మకాలు చేస్తూ రోజువారిగా రికార్డు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో డీఈఓ శ్రీదర్‌స్వామి, ఇచ్చోడ ఏడీఏ రామకృష్ణ, విశ్వమిత్ర, నేషనల్ ఫర్టిలైజర్ కంపెనీ ప్రతినిధులు వంశీకృష్ణ, మారుతి, మండల వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు తదితరులున్నారు.

యువత ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

● ఎమ్మెల్యే పాయల శంకర్



పల్లకి ఎత్తుకున్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): యువత ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ భగవంతుడి సన్నిధిలో గడపాలని, ఆంజనేయ స్వామి కృపతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆకాంక్షించారు. మంగళవారం బంగారిగూడలో నిర్వహించిన హనుమాన్ పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో కొనసాగింది. దీక్షాపరులతో కలిసి భక్తి పాటలు ఆలపిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. మఠాధిపతి యోగానంద సరస్వతి ఉన్నారు.

'రక్తదానానికి యువత ముందుకు రావాలి'

బేల, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మదిన వేడుకలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 75 మంది అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోథ్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగాణక్క, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ హాజరై కేక్ కట్ చేసి సామ రూపేష్ రెడ్డికు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన కాల్వ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని కాల్వగ్రామానికి తీసుకెళ్తున్న భక్తులు

దిలావర్‌పూర్, మే 20 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం మారుపెళ్లి సేవలతో ముగిశాయి. ఈ నెల 11న ఆదివారం అఖండ దీప స్థాపనం, నరసింహ స్వామి జయంతితో స్వామివారి బ్రహ్మో త్సవాలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో వేలాది మంది భక్తులు శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇద్దరు అమ్మవార్ల మధ్యలో కూర్చున్న శ్రీ నరసింహ స్వామివారికి అశ్వరథంపై కాల్వ గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ అనువం శిక యజ్ఞాచార్యులు నరసింహమూర్తి, ఆలయ అర్చకులు ప్రకటించారు.

కేంద్ర విధానాలు కార్మికులను కాలరాస్తున్నాయి : సీఐటీయూ

నిర్మల్ కల్చరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత కఠినంగా అమలు చేస్తూ హక్కు లను కాలరాస్తున్నాయని సీఐటీయూ ఉపా. ధ్యక్షురాలు బి. సుజాత ఆరోపించారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సంఘం ధర్నా, పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వంద ఏళ్ల క్రితం సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను కేంద్రం తీసుకొచ్చిందన్నారు. దీంతో పెద్ద ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ ఉద్యోగాలను కుదిస్తూ పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్, క్యాన్సలిడేటెడ్ ఉద్యోగులను నియమిస్తున్నారన్నారు. యూపీఎస్ అమలు చేస్తూ పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ తదితర హక్కులను తొలగిస్తూ కార్మికులను బానిసత్వంలోకి నెట్టుతున్నారని ధ్వజమెత్తారు.

ఖానాపూర్ : నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఖానాపూర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ భైంసా పట్టణ, మండలాల కార్యవర్గం ఎన్నిక

భైంసా, మే 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సూచన మేరకు బీజేపీ భైంసా పట్టణ, మండలాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లుగా ఆ పార్టీ భైంసా పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు రావుల రాము, సిరం సుష్మారెడ్డిలు తెలిపారు. మంగళవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో విలేకరుల సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. భైంసా పట్టణ ఉపాధ్యక్షులుగా చొప్పరి వెంకటేష్, గాలి రాజన్న, తూమోల్ల దత్త్రాత్రి, గడ్డం సాయినాథ్, ప్రధాన కార్యదర్శులుగా దగ్గే శ్రీకాంత్, సిందే కపిల్, కార్యదర్శులుగా శాంత గడేకర్, సందుల శంకర్, జాదవ్ మన్మోహన్, చర్ల సుభాష్, కోశాధికారిగా ఉమేష్ పురోహిత్‌లతో పాటు మరో 34 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించామన్నారు.

ముథోల్ తహసీల్దార్‌గా శ్రీలత

ముథోల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండల తహసీల్దార్‌గా కే. శ్రీలత మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇదివరకు పని చేసిన తహసీల్దార్ శ్రీకాంత్ నర్సాపూర్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో పని చేసిన తహసీల్దార్ కే. శ్రీలతకు నిర్మల్ జిల్లాకు కేటాయించారు. బదిలీపై ముథోల్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు ముథోల్ ఆర్ఐ నారాయణ రావు పటేల్, సరస్వతి, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ, వీఆర్ఏలు సిబ్బంది పూలబొకేతో స్వాగతం పలికారు.

నైపుణ్యాలను మెరుగుపరచడం కోసమే శిక్షణ

ముథోల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక పాఠశాలలో బోధన నైపుణ్యాలను మెరుగుపరచడం కోసమే ఉపాధ్యాయులకు సామర్థ్యాభివృద్ధి 5 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ముథోల్ మండల విద్యాధికారి రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణ 24వ తేదీ వరకు నిర్వహించబడుతోందన్నారు. శిక్షణ ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడేలా చేయడం ముఖ్య ఉద్దేశ్యంగా ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తరోడా గ్రామ పంచాయతీ కార్యదర్శి బదిలీ

ముథోల్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన ఎన్. భాస్కర్ గౌడ్ బదిలీపై లోకేశ్వరం మండలం కిష్టాపూర్ గ్రామ పంచాయతీకి వెళ్లినట్లు ఎంపీడీవో శివ కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంఈవో నరేందర్

తానూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తానూర్‌లో మంగళవారం ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులు 5రోజుల పాటు కొనసాగనున్నాయని ఎంఈవో నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతుల కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఏ విధంగా నాణ్యమైన విద్యను అందించే విధంగా ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించి ఆ తర్వాత ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తానూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఝరి(బి) గ్రామానికి చెందిన బొడ్లోళ్ల పోతన్న(53) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ట్రైని ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం... పోతన్నకు రెండు ఎకరాల భూమి ఉంది. గత రెండు సంవత్సరాల నుండి పంటలు సరిగా పండక పోవడంతో అప్పులు కాగా అప్పులు ఎలా తీర్చాలని మనస్థాపానికి గురయి సోమవారం రాత్రి తన చేనులో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రుక్మాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పశువుల పాక దగ్ధం

సోనాల,మే20(ఆంధ్రజ్యోతి):అర్ధరాత్రి పశువుల పాకదగ్గం అయిన ఘటన సోమవారం మండల కేంద్రంలోని చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన రేంజర్ల సదుర్శన్, రాములు వ్యవసాయ పొలంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని పశువుల పాకలో ఉన్న ఎండుగడ్డి, వ్యవసాయ పరికరాలు నీటి మోటర్ పూర్తిగా కాలిపోయాయి. దాదాపు ఐదు లక్షల వరకు నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి మృతి

తలమడుగు, మే 20(ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్లికే గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయని ఎస్సై రాధిక తెలిపారు.. వివరాల ప్రకారం తలమడుగు మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన లింగారెడ్డి చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌గా కొలంగూడ గ్రామానికి చెందిన సీడం సురేష్ అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాల నుంచి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ వ్యవసాయ పనులు రోజుటి లాగానే మంగళవారం వ్యవసాయ పొలంలో దున్నేందుకు ఇంటి నుంచి పొలానికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు పల్లి కే గ్రామ సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడడంతో ట్రాక్టర్ నడుపుతున్న సురేష్ (22) పైన ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంట ఉన్న మరో వ్యక్తి మెరుగు ప్రణీత్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అదిలాబాద్ రిమ్స్‌కు తరలించడం జరిగిందని కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు తలమడుగు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి మృతి చెందిన మృతుని కుటుంబానికి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నేరడిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం మండలంలోని ఆరేపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల కే ఆర్ కే కాలనికి చెందిన శాంతి స్వరూప్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం రోడ్డుపై గత మూడు రోజులుగా ఆగి ఉన్న కంటైనర్‌ను శాంతి స్వరూప్ గమనించక పోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. శాంతి స్వరప్ ఆదిలాబాద్ నుండి నిజామాబాద్‌లో పరీక్షలు రాసి ఆదిలాబాద్ వచ్చే క్రమంలో కంటైనర్‌ను ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. జాతీయ రహదారి కంటైనర్ గత మూడు రోజులుగా ఉండడంతో ప్రమాదం జరిగింది. రహదారుల శాఖ అధికారులు స్పందించి ఉంటే నిండు ప్రాణం బలయ్యేది కాదని స్థానికులు ఆరోపించారు.

కేసు నమోదు

తానూర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలూర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు అయినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకార.... గ్రామానికి చెందిన రుద్రముడ్ అశోక్ ఈ నెల 16వ తేదిన తన చేన్లో ఒడ్డుకు ఉన్న వేప చెట్టును నరుకుతుండగా, అశోక్‌కు వరుసకు అన్న అయిన గుర్రముడ్ గంగాధర్ అక్కడికి వచ్చి చెట్టును ఎందుకు నరుకుతున్నావని ప్రశ్నించగా అశోక్, అతని భార్య కౌలస్య, పెద్ద కుమారుడు సుధామ్‌లు గంగాధర్‌పై చేతులతో, రాళ్లతో దాడి చేశారు. దీంతో గంగాధర్‌కు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు అతన్ని భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాధితుడు గంగాధర్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దాడికి పాల్పడిన అశోక్, అతని భార్య కౌశల్య, పెద్ద కుమారుడు సుదామ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన


జాతీయ రహదారి పక్కనే పారవేసిన హోటళ్లకు సంబంధించిన గుడ్ల పెంకులు


ప్రైవేటు ఆసుపత్రులకు సంబంధించిన సిరంజిలు, సెలైన్ బాటిళ్లు, తదితరాలిలా..

ఇచ్చోడలో అస్తవ్యస్తంగా చెత్త సేకరణ

● నిరుపయోగంగా డంపింగ్ యార్డులు ● చెత్తకు నిప్పుపెట్టి చేతులు దులుపుకుంటున్న పంచాయతీ సిబ్బంది ● పట్టించుకోని గ్రామ పంచాయతీ అధికారులు

ఇచ్చోడ, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి పొడి, చెత్త సేకరణ అస్తవ్యస్తంగా మారింది. చాలా గ్రామాల్లో చెత్త సేకరణ జరగడంలేదు. ఫలితంగా గ్రామాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. సేకరించిన చోట సేంద్రియ ఎరువు తయారీ లేదు. తడి, పొడి చెత్త వేరుచేయక అడవుల్లో, చెరువుల్లో, కుంటల్లో, పాడుబడిన బావుల్లో, అంతేకాకుండా బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. పలుచోట్ల వాహ నాలు సరిగ్గా లేకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో చెత్త సేకరణ నిలిపివేశారు. దీంతో పర్యావరణం మరింత కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

నిలిచిన సేంద్రియ ఎరువు తయారీ

ఇచ్చోడ మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని పంచాయతీల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. చాలా చోట్ల సేంద్రీయ ఎరువు తయారీ లేదు. పలు చోట్ల ట్రాక్టర్‌లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. బహిరంగంగా చెత్త వేస్తే చర్యలు చేపడతామని పంచాయతీ అధికారులు చెబుతున్నా.. రోడ్లపైనే వేస్తున్నారు.

అలంకారప్రాయంగా..

గ్రామ పంచాయతీలలో డంపింగ్ యార్డులు ఉన్నప్పటికీ.. చాలా గ్రామాల్లో ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్త యార్డులకు తరలించకుండా బహిరంగా ప్రదేశాలల్లో తగలబెడుతున్నారు. మొదట్లో చెత్త తరలించి తడి, పొడి చెత్త వేరు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా లేదు. ఇచ్చోడలో తడి పొడి చెత్త సేకరించి సేంద్రీయ ఎరువులుగా మార్చేందుకు నిర్మించిన యార్డులు నిరుపయోగంగా మారాయి. ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సేకరించిన చెత్తను శివారులోకి తరలించి కాల్చివేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక ప్రస్తుతం ఆటకెక్కింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పాటు నిధుల కొరతతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారిందని ప్రజలు వాపోతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

పారిశుధ్య నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో స్థానికంగా గ్రామ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఏదో అడపదడప గ్రామ పంచాయతీకి వెల్లడం, పంచాయతీ కార్యాలయానికే పరిమితం కావడంతో.. పారిశుధ్యంపై పట్టింపు కరువైందని స్థానిక ప్రజలు చెబుతూ వస్తున్నారు. నిబంధనల ప్రకారం చెత్త సేకరణ జరగడంలేదని ఎన్నో ఫిర్యాదులు వసున్నా.. అధికారులు పట్టించుకోవడమే లేదంటున్నారు. లక్షల రూపాయాలు ఖర్చు పెట్టి డంపింగ్ యార్డులను నిర్మించినా.. అసలు ఫలితం లేకుండనే పోయింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారి పోతుందనే విమర్శలు వస్తున్నాయి.


ఇచ్చోడలో నిరుపయోగంగా కనిపిస్తున్న సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం


అలంకారప్రాయంగా ఉన్న డంపింగ్ యార్డులో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు


డంపింగ్ యార్డు సమీపంలో చెత్తను బహిరంగంగా కాల్చివేస్తున్నారిలా..


పొలంలో పశువుల పేడను వేసుకుంటున్న రైతు

పశువుల పేడతో.. ప్రయోజనాలెన్నో!!

❒ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
❒ సేంద్రియ పద్ధతులు పాటించాలి
❒ మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి వెల్లడి

నేరడిగొండ మే 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలలోని పోషకాల నిల్వలో సమతుల్యం లోపించి ఉత్పాదక శక్తి తగ్గుతుంది. చీడపీడలు ఆశించడం సూక్ష్మపోషకాల లోపాలతో దిగుబడులు పడిపోతున్నాయి. ఈ సమస్యలను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి పేర్కొంటున్నారు.


కృష్ణవేణి, మండల వ్యవసాయ అధికారి

● సేంద్రియ ఎరువులతో సమానం

పశువులు, మేకలు, గొర్రెల పేడ పంటల సాగుకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. వీటి పేడ సేంద్రియ ఎరువుతో సమానం. వీటిని వేసవి దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. దీంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించడానికి వీలవుతుంది. దుక్కులు దున్నిన తరువాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడి పెరగడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల పేడ సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. ఒక ఎకరానికి 4 నుంచి 5 ట్రాక్టర్‌ల పశువుల పేడను వాడాలి.

● ఇలా చేస్తే భూసారం పదిలం..

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తారు. అదే సమయంలో ఎండలో ఎక్కువగా ఉంటాయి. ఎండలు అధికంగా ఉన్న సమయంలో పొలంలో ఎరువులు వెదజల్లితే వాటిలోని పోషకాలు ఆవిరిరూపంలో నష్టపోతాయి. కాబట్టి పశువుల పేడను పొలంలో వేసవిలో కుప్పలుగా పోసుకోవడం మంచిది. భూమిలో తగిన తేమ ఉన్న సమయంలో వెదజల్లి వెంటనే దుక్కిలో కలియ దున్నాలి. దీని వలన భూమిలోసారం పెరుగుతుంది భూమి గుల్ల బారడానికి తోడ్పడుతుంది. సహజసిద్ధమైన పోషకాలు అందుతాయి. నేలలోని అధిక అమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలను మొక్కలకు అందుబాటులో ఉండేలా సహకరిస్తాయి. నైట్రైట్‌లు భూమి నుంచి బయటకు పోకుండా అరికడతాయి. మొక్కల వేరు వ్యవస్థ పెరుగుదలకు తోడ్పడుతుంది. నీరు, పోషక పదార్థాలను తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది నేలలో ఉన్న మంచి సూక్ష్మ జీవుల అభివృద్ధికి తోడ్పడి రైతుకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధ్యమవుతాయి.

● దుక్కి చేయాల్సిన తీరు

దుక్కిని ఇష్టారీతిన దున్నడం వలన పంటలకు నష్టం వాటిల్లుతుంది. అంతేకాకుండా రైతులు వేసవి కాలంలో మెట్ట భూములను ఖరీఫ్ సీజన్ కోసం సిద్ధం చేసుకుంటారు. అయితే, మెట్ట ప్రాంతంలో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ఖరీఫ్ సీజన్‌లో వచ్చే అధిక వర్షాలకు సారవంతమైన మట్టి నీటి వనరులకు వాలు ప్రాంతంలో కొట్టుకు పోతుంది. వాలు ప్రాంతంగా దుక్కి దున్నితేనే.. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం వేగం తగ్గి మట్టి కొట్టుకు పోకుండా ఉంటుంది.

త్రివర్ణమయమైన భైంసా

● సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ ● భారీ సంఖ్యలో హాజరైన జనం ● యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్ ● ప్రత్యేకంగా నిలిచిన మోహన్‌రావ్ ప్రజా ట్రస్టు యాత్ర

భైంసా, మే 20(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాలలకు సంఘీభావంగా మంగళవారం భైంసాలో చేపట్టిన తిరంగా ర్యాలీతో పట్టణమంతా త్రివర్ణమయమయ్యింది. భైంసాలోని కుల సంఘాల ఆద్వర్యంలో చేపట్టిన తిరంగా ర్యాలీకి పట్టణ పరిధిలో విశేష స్పందన లభించింది. అన్ని కులాల, మతాల, వర్గాల వారు ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని సైనికులకు సంఘీభావంగా ప్రదర్శనలు చేపట్టారు. పలువురు చిన్నారులు సైనికులు, జాతీయ నాయకులు, భారత మాత వేషాధారణలతో యాత్రలో పాల్గొని తిరంగా ర్యాలీకి వన్నె తెచ్చారు. తిరంగా యాత్రలో పాల్గొన్న వారు జాతీయ పతాకాలను చేతపట్టి సైనికులకు మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాలు జాతీయ పతాకలే దర్శనమివ్వడంతో పట్టణమంతా త్రివర్ణమయంగా కనిపించింది. ఉదయం 10.30 గంటలకు స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ పట్టణ పరిధిలోని ప్రధాన రోడ్డు మార్గం మీదుగా బస్టాండ్ ఎదుట గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్, భైంసా పట్టణ హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు ర్యాలీలో ముందునడువగా.. మిగతా శ్రేణులన్నీ వారిని అనుసరించాయి. ర్యాలీలో ఆద్యంతం సైనికులకు మద్దతుగా, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు కొనసాగాయి. దేశభక్తి గేయాలకు ర్యాలీలో పాల్గొన్న పలువురు ఉత్సహ భరితంగా నృత్యాలు చేశారు. ర్యాలీ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ స్థలికి చేరుకున్న అనంతరం.. అమరులైన సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌తో పాటు పలువురు ప్రతినిదులు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పేరిట భారత త్రివిధ దళాలు ఉగ్రమూక స్థావారాలను ధ్వంసం చేయడమే కాకుండా పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించాయని పేర్కొన్నారు. ఇద్దరు మహిళా సైనికుల సారథ్యంలో చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలను అలవోకగా సాధించాయన్నారు. భారత సైన్యం దాటికి విలవిలలాడిపోయిన పాకిస్తాన్ కాళ్ల బేరానికి దిగి వచ్చిందన్నారు. అలాగే సైనికుల పరాక్రమ తీరు వల్ల పాకిస్తాన్ తోకముడవక తప్పలేదన్నారు. భారతీయులందరూ త్రివిధ దళాలకు మద్దతుగా నిలువాలని పిలువునిచ్చారు. సైనికులకు సంఘీభావంగా చేపట్టిన ర్యాలీకి విశేష స్పందన లభించడం గర్వించతగ్గ విషయమన్నారు. అలాగే, బోస్లే మోహన్‌రావ్ పాటిల్ నేతృత్వంలో మోహన్‌రావ్ ప్రజా ట్రస్టు మంగళవారం భైంసాలో చేపట్టిన తిరంగా యాత్ర ప్రత్యేకంగా నిలిచింది. స్థానిక దారాబ్జీ జిన్నింగ్ ఫ్యాక్టరీ నుంచి ప్రధాన రోడ్డు మార్గం మీదుగా ట్రస్టు తిరంగా యాత్ర కొనసాగింది. ఇందులో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో వివిధ కుల సంఘాలు


భైంసాలో మోహన్‌రావ్ ప్రజా ట్రస్టు నిర్వహించిన తిరంగా యాత్ర


సైనికులు, భారతమాత వేషధారణలతో యాత్రలో పాల్గొన్న చిన్నారులు

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలి

ఆదిలాబాద్ టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జూన్ 6,7,8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి కోరారు. ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హాకీ టోర్నమెంట్ నిర్వహణ తీరుపై చేర్చించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ టోర్నమెంటుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 10 జిల్లాల నుంచి కి టీమ్‌లు హాజరుకానున్నాయని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే టోర్నమెంట్లో క్రీడాకారులకు అన్ని వసతులు ఏర్పాటుతో పాటు టోర్నమెంట్ ను విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి, తీర్మాణం చేయడం జరిగిందన్నారు. అధికారులు, క్రీడా అభిమానులు, పట్టణ ప్రజలు సహకరించి టోర్నమెంట్ విజయవంతం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, పలువురు హాకీ కోచ్‌లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి

సంత.. మర్నాడు కంపు..!!

ఇచ్చోడ, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతీ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దఎత్తున సంత నిర్వహిస్తారు. సంత ముగిసిన రోజు ఉదయం పంచాయతీ కార్మికులు చెత్తను ఇక్కడి నంచి తరలిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో రెండ్రోజుల వరకు తరలించకపోవడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. పంచాయితీ అధికారులు సంత ముగిసిన మర్నాడు చెత్తచెదారం లేకుండా తగుచర్యలు చేపట్టాల్సిన అవసరం ఏంతైనా ఉంది. ఇచ్చోడలో సంత నిర్వహించే చోటు ఇచ్చోడలోని మార్కెట్ ప్రధాన రోడ్డుపై కావడంతో మార్కెట్‌లో ఉండే వ్యాపార సముదాయాలు, ఇళ్లలో ఉండే వారికి దుర్వాసన వెదజల్లు తోంది. సంతల ద్వారా గ్రామపంచాయితీకి లక్షల్లో ఆదాయమున్నా సంత కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించక పోవడతో పాటు సంతలో కనీస సౌకర్యాలు చేపట్టడంలేదు. ఇదిలా ఉండగా సంత మరునాడు అయినా చెత్తను క్లియర్ చేయడం లేదు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


● ఇచ్చోడలో సంత మరుసటి రోజు చెత్తతో పేరుకుపోయిన దృశ్యాలిలా..


ఇరుముడులతో బయలుదేరుతున్న అంజన్న స్వాములు

కొండగట్టుకు తరలిన స్వాములు

కుభీర్, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయ మాలదారణ స్వాములు మంగళవారం విఠలేశ్వర ఆలయం నుంచి కొండగట్టులోని హనుమాన్ ఆలయానికి తరలి వెళ్లారు. మండల దీక్షను పూర్తి చేసుకొని గురుస్వామి పుప్పాల పీరాజీచే ఇరుముడిని కట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మస్కాపూర్‌లో గోడ ప్రతులను విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

అడ్మిషన్ల కోసం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయుల ప్రచారం

ఖానాపూర్, మే 20(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో కొత్త విద్యార్థులను చేర్చుకునేందుకు కార్పొరేట్ స్థాయిలో ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు చేస్తున్న ప్రచారం ఆదర్శంగా నిలుస్తోంది. మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో విద్యార్థులు సాధించిన అత్యుత్తమ మార్కుల జాబితాలో గోడ ప్రతులను ముద్రించారు. ముద్రించిన ఈ గోడ ప్రతులను మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విడుదల చేశారు. గోడ ప్రతులతో పాటు కరపత్రాలను సైతం ముద్రించి తమ పాఠశాలలో ఉన్న సౌకర్యాలను, అందిస్తున్న విద్యా ప్రమాణాలను ప్రజలకు తెలిసేలా చేస్తున్న మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను పలువురు అభినందించారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాజిద్, వీడీసీ అధ్యక్షుడు అద్వాల శంకర్, రాచర్ల లక్ష్మణ్, పుప్పాల గజేందర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



బోథ్‌లో వడదెబ్బతో యువకుడి మృతి

బోథ్, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని న్యూ కాలనీకి చెందిన షేక్ అమౌంత్(18) అనే యువకుడు మంగళవారం వడదెబ్బ బారిన పడి మృతి చెందాడు. ఎందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు గత మూడు రోజులుగా క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతున్నారని అయితే మంగళవారం మధ్యాహ్నం క్రీడా మైదానంలో వాంతులు చేసుకొని కుప్ప కూలిపోయాడని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ విషయం గమనించిన మిత్రులు ఆసుపత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

బోధనలో మార్పులు అవసరం

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ హైస్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయులకు ఐదు రోజుల మండల లెవెల్ శిక్షణ (జైనథ్ మండలం) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొని పలు సూచనలు సలహాలు చేశారు. మంగళవారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలు, బోధన నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం, జీవన నైపుణ్యాల పెంపు కోసం ఐదు రోజుల మండల స్థాయి వృత్తాంతర శిక్షణలో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణలో మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గుణాత్మక విద్య నైపుణ్యత శిక్షణా తరగతులు, వృత్తాంతర శిక్షణను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులను కోరారు. రాష్ట్ర స్థాయిలో పొందిన శిక్షణను తరగతి గదికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందనే విషయాన్ని తెలియజేస్తూ ఉపాధ్యాయులంతా తరగతి గదికి నిత్య నూతనంగా వెళ్లాలని సూచించారు. విద్యార్థుల నమోదుతో పాటు గుణాత్మక విద్యలో సమూల మార్పులు తెచ్చి జిల్లాకు మంచిపేరు తేవాలని కోరారు. మార్పుల కనుగుణంగా ఉపాధ్యాయులు నూతన విధానంలో బోధన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాస్, సుజిత్ ఖాన్, ప్రోగ్రాం అధికారులు, రిసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.



ప్రధాన కార్యదర్శిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ రావును కలిసిన ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్, మే 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో చీఫ్ సెక్రెటరీ కే.రామకృష్ణ రావును ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఇది ఇలా ఉండగా తెలంగాణ రాష్ట్ర సారథి వెన్నెలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

డీపీవో ఆకస్మిక తనిఖీ

సోనాల, మే20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి ఫణిందర్ బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీని సందర్శించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపడుతున్న చర్యలు వంటివి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ప్రతీరోజు గ్రామంలో చెత్త సేకరణ జరగాలని, అలాగే వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అతుల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

పట్టణంలో ఆక్రమణల తొలగింపు

ఆదిలాబాద్ టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని రహదారులపై ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. ప్రధాన చౌక్‌ల్లో రహదారిపై తోపుడు బండ్లు, ఫుట్ పాత్‌పై వ్యాపారాలను తొలగింపు ప్రక్రియ పోలీసులు మున్సిపల్, అధికారులు కలిసి చేపట్టారు. తోపుడు బండ్ల తొలగింపు సందర్భంగా పలువురు వీధి వ్యాపారాలు తమ ఉపాధి కోల్పోతున్నామని ఆందోళనకు దిగడంతో పలువురు వీధి వ్యాపారులను అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. భారీ బందోబస్తు మధ్య ఆక్రమలను తొలగిస్తున్నారు.

ఆక్రమిస్తే చర్యలు తప్పవు : ఆర్డీవో

ఆదిలాబాద్‌లోని వీధి వ్యాపారులకు ముందలిస్తూ నోటిసులు ఇచ్చిన తర్వాతే ఆక్రమణలను తొలగించినట్లు ఆర్డీవో వినోద్ కుమార్ తెలిపారు. అయితే మూడు నెలల నుంచి వారి సమస్యలపై చర్చించి గణేష్ టాకీస్ ఖాళీ స్థలంలో తాత్కాలికంగా వ్యాపారం చేసుకునేలా లక్కీ లాటరీ నిర్వహించామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా, సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఫుట్ పాత్‌పై ఆక్రమణల తొలగించామని ఆయన పేర్కొన్నారు. మళ్లీ ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వీధి వ్యాపారుల సమస్యకు పరిష్కారం చూపాలి

వీధి వ్యాపారులకు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా, తాత్కాలిక స్థలానికి దుకాణాలను తరలించడం ఎంతవరకు సమంజసమని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బలహీన వర్గాలు అయిన వీధి వ్యాపారుల సమస్యలపై పలుమార్లు మంత్రి సీతక్క, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌ను కలిశామన్నారు. అయినా వారు వీధి వ్యాపారుల సమస్యలను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు.





మళ్లీ.. పత్తిదే పెత్తనం!

- జిల్లాలో 5లక్షల 85వేల ఎకరాలలో పంటల సాగు
- తొలకరి వర్షాలకే పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- ఈసారి విత్తనాల కొనుగోలుపై అన్నదాతల ముందుచూపు
- ఖరీఫ్ ప్రణాళిక రెడీ అంటున్న వ్యవసాయ శాఖ

ఆదిలాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన జిల్లాలో మళ్లీ పత్తి పంటదే పెత్తనం అన్నట్లుగా కనిపిస్తుంది. పత్తి పంట తర్వాత సోయా, కంది, జొన్న, మొక్కజొన్న పంటలను రైతులు ప్రధానంగా సాగు చేస్తారు. అయితే 2025-26 ఏడాదికి సంబంధించిన పంటల సాగు ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. ఈ యేడు జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5లక్షల 85వేల ఎకరాలు కాగా ఇందులో అధికంగా 4లక్షల 40వేల ఎకరాలలో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నీటి వనరులు అంతంత మాత్రంగానే ఉండడంతో ఎక్కువగా వర్షాధారంగానే పంటలను సాగు చేస్తారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో ప్రతియేటా అతివృష్టి అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే ఓ యేడు నష్టం వచ్చిన మరో యేడు లాభం రాకపోతుందా? అనే అతి ధీమాతో ఖరీఫ్ పంటల సాగుకు శ్రీకారం చుడుతున్నారు.

జిల్లాలో వివిధ రకాల పంటలు సాగు వివరాలు ఇలా..

పత్తి పంట	4.40 లక్షల ఎకరాలు
సోయాబీన్	65,464 ఎకరాలు
కంది పంట	57,258
జొన్న పంట	1,493
మొక్కజొన్న	15,066
వరి	2,030
పెసర పంట	546
మినుము పంట	561
ఇతర పంటలు	231

నేలను చదును చేస్తున్న రైతులు

ఇప్పటికే వేసవి దిక్కులను పూర్తి చేసిన రైతులు విత్తనాలు వేసేందుకు నేలను చదును చేస్తున్నారు. నల్లమట్టి, సేంద్రియ ఎరువులను పంట చేలలోకి తరలిస్తున్నారు. నేలలో సరైన తేమ శాతం లేనిదే విత్తనాలను విత్తుకుంటే ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కనీసం 60 శాతం తేమ ఉన్న నేలల్లోనే విత్తనాలు వేసుకోవాలని సూచిస్తున్నారు. మరో వారం రోజుల్లో తొలకరి వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో రైతులు విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేస్తూ నిలువ చేసుకుంటున్నారు. అయితే వేడి నేలల్లోనే పత్తి, సోయా విత్తనాలను విత్తుకుంటే చీడపీడలు ఆశించకుండా ఉంటాయని..



పత్తి పంటలో దౌర కొడుతున్న రైతు



పత్తి పంట(ఫైల్)

అలాగే పంటలు ఏపుగా పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

11 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

ఖరీఫ్ కాలం సమీపిస్తుండడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవు తున్నారు. జిల్లాలో ప్రస్తుతం అడపదడప వర్షాలు కురుస్తున్నాయి. మే 25 తర్వాత కురిసిన తొలకరి వర్షాలకు విత్తనాలను వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సాగునీటి సౌకర్యం ఉన్న కొంత మంది



రైతులు పసుపు, పత్తి, సోయా విత్తనాలను విత్తినట్లు తెలుస్తోంది. డ్రిప్ సహాయంతో పత్తిని సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే గతేడు తీవ్రమైన విత్తనాల కొరత తలెత్తడంతో రైతులు ఆందోళనలు ధర్నాలు, నిరసనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈసారి ముందుచూపుతోనే నెల రోజుల నుంచి విత్తనాలు ఎరువులను కొనుగోలు చేస్తూ ఇళ్లలో నిలువ చేసుకుంటున్నారు. ఈసారి 11 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా పత్తి విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. జిల్లాలో నల్లరేగడి నేలలు అధికంగా ఉండడంతో పత్తి పంటను సాగు చేసేందుకే రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువగా రాశి 659 పత్తి విత్తనాలకు డిమాండ్ ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే అనుకూలమైన మద్దతు ధర, సీసీఐ కొనుగోళ్లకు అవకాశం ఉండడంతో పత్తి సాగు వైపే రైతులు పరుగులు తీస్తున్నారు.

విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలి

: శివకుమార్, ఏడీఏ, ఆదిలాబాద్

రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. తప్పని సరిగా రశీదును తీసుకోవాలి. ఏదైనా అనుమానం వస్తే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. అందరు ఒకేసారి కాకుండా రైతుల వీలును బట్టి విత్తనాలను కొనుగోలు చేయాలి.

ఏజెన్సీ చట్టాలను దుర్వినియోగం చేస్తున్న

జాతి ద్రోహులపై చర్యలు తప్పవు

● రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు గోడం గణేష్ ● కేస్లాపూర్‌లో ఆదివాసీ సంఘాల సమావేశం

ఇంద్రవెల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ చట్టాలను ఆసరాగా చేసుకుని చట్టాలను దుర్వినియోగం చేస్తున్న జాతి ద్రోహులైన ఆదివాసీ సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రతం దుర్గు, తుడుందెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్‌లు అన్నారు. మంగళవారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఆదివాసీ సంఘాలు నాయకులు, ఆదివాసీ పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో 1/70ను ఆసరాగా చేసుకుని చట్టాలను దుర్వినియోగం చేస్తూ జాతిని ద్రోహం చేస్తున్న నాయలపై చర్యలు గురించి, ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేసే విషయాలపై హాజరై సంఘాల నాయకులు, రాయిసెంటర్ సార్మేడీలు, ఆదివాసీ పెద్దలతో చర్చించారు. ఆదివాసీ పెద్దల తీర్మానాలను పట్టించుకోకుండా నోటీసులు ఇచ్చిన ఆదివాసీ సమావేశాలకు దూరంగా ఉంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆదివాసీ సంఘాల పేర్లు చెబుతూ ఇటు అధికారులకు ఇబ్బంది పెట్టి, గిరిజనేతరులకు భయభ్రాంతులకు గురి చేసి.. చట్టాలను దుర్వినియోగం చేసి ఆదివాసి జాతిని బద్నాం చేస్తున్న ఆదివాసీ నాయకులపై చర్యలు తీసుకుంటామని వారు ఈ సందరర్భంగా స్పష్టం చేశారు. త్వరలో ఆదివాసీ జాతి ద్రోహుల పేర్లను జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ, ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందోర్ బాదిరావ్, రాయిసెంటర్ సార్మేడీలు మెస్రం వెంకట్‌రావు, ఆయా గ్రామాల పెద్దలు పుర్క బాపూరావు, వెట్టి రాజేశ్వర్, ఆయా గ్రామాల ఆదివాసీ సంఘాల నాయకులు, పెద్దలు, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ పెద్దలు

ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయండి

● వేసవి శిక్షణ తరగతుల్లో ఆర్‌జేడీ సత్యనారాయణ

నేరడిగొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆర్‌జేడీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎంపీయూపీఎస్, ఎంపీపీఎస్ పాఠశాలలోపని చేస్తున్న ఎస్‌జీటీ, పీఎస్‌హెచ్‌ఎం ఉపాధ్యాయులు అందరికీ జడ్పీఎస్ఎస్ నేరడిగొండ ఐదు రోజుల ఎఫ్‌ఎల్ఎన్ ట్రైనింగ్‌లో భాగంగా శిక్షణ కేంద్రాన్ని ఆర్‌జేడీ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయుల యొక్క స్థాయి సామర్థ్యాలు, బోధనలో మెలుకువలు మెరుగుపరచడం, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మండల స్థాయి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిక్షణ సమయం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భూమారెడ్డి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రామ్ అనిల్, ఆర్‌పీలు గంగాధర్, రాజ్‌కుమార్, సంతోష్, రవీందర్, చంద్ర శేఖర్, శివలీల, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● లక్కారంలో ఐదు రోజుల శిక్షణను ప్రారంభించిన ఎంఈవో

ఉట్నూర్: మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంఈవో రాపల్లి ఆశన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉట్నూర్ మండలంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో భాష గణిత మౌలిక అంశాలపై రిసోర్స్‌పర్సన్‌లు చెప్పే అంశాలను చక్కగా నేర్చుకొని పాఠశాలలకు వెళ్లిన తర్వాత విద్యార్థులకు బోధించాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం బోధన అంశాలపై జాతీయ విద్యా విధానం 2020ని అనుసరించి ఉపాధ్యాయులకు వినూత్న బోధన పద్ధతులు వివరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని, నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం కోసం పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌లు రాజ్‌కుమార్, కుంరశ్రీనివాస్, ఉదారం, బాదు,రవికుమార్, రవీందర్, సుధాకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● నిరంతర విద్యార్థి.. ఉపాధ్యాయుడు : ఎంఈవో

భీంపూర్: ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులే అని ఎంఈవో శ్యామ్ సుందర్ అన్నారు. మంగళవారం పిప్పల్‌కోటి కాంప్లెక్ పాఠశాలలో మండల ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ తరగతులు ఐదు రోజుల పాటు ఉంటాయని, మండలంలోని 54 మంది ఎస్‌జీటీలకు, ముగ్గురు ప్రైమరీ ప్రధానోపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ ఎలా బోధించాలి? విద్యార్థికి ఎఫ్ఎల్ఎన్‌పై ఉపాధ్యాయుడు ఏ విధంగా అవగాహన కల్పించాలి? అనే దానిపై సూచనలు చేయడం జరిగిందన్నారు. గతంలో ప్రతీనెల ఒకసారి పేరెంట్స్ మీటింగ్ ఉండేదని, ఇప్పటి నుంచి ప్రతీ శుక్రవారం ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్ యాదవ్, ఉపేందర్, ఉష్కం తిరుపతి, గంపల ప్రభాకర్, ఆర్ ఎస్‌లు సప్తగిరి, జయసారతి, రాజు, మల్లెల అశోక్, శ్రీనివాస్, లక్ష్మి, సిఆర్‌పిలు పడాల రవీందర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణ



భీంపూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో శ్యామ్‌సుందర్



బిందెలు, బకెట్లతో రహదారిపై బైఠాయించిన కాలనీవాసులు



నిరసనదారులను సముదాయిస్తున్న పోలీసులు

తాగునీటి సమస్యను పట్టించుకోవట్లేదు

● గుక్కెడు నీటి కోసం రోడ్డెక్కిన అశోక్ నగర్ వాసులు

● పట్టించుకోని అధికారులు

ఇచ్చోడ, మే 20(ఆంధ్రజ్యోతి): ఎండలు ముదురుతుండడంతో జిల్లా వ్యాప్తంగా తాగునీటి ఎద్దడి పెరిగిందనడానికి ఇదే నిదర్శనం. గుక్కెడు తాగునీటి కోసం మండలకేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీవాసులు మంగళవారం రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ కాలనీ తాగునీటి గోడును వినిపించేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టు తిరిగినా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. తమ సమస్యను తీర్చలేకపోవడంతో కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి తమ సమస్యను పరిష్కరించేంతా వరకు ఇక్కడినుంచి వెళ్లబోమని నిరసనకు దిగారు. ఉదయం నుంచి 10 గంటల వరకు సాగిన ఈ ఆందోళనలో మహిళలు, చిన్నపిల్లలు కూడా పాల్గొన్నారు. పోలీసులు వచ్చి కాలనీ వాసులను సముదాయించినా.. తమ సమస్య పరిష్కారం కాకపోవడంతోనే రోడ్డుపై బైఠాయించామని కాలనీవాసులు వివరించారు. ఎంపీడీఓ, గ్రామ పంచాయతీ ఈఓ కార్యాలయాలల్లో లేనందున, అధికారులు సెలవుల్లో ఉండడంతో మా పరిస్థితి అధికారులకు ఎలా తెలియజేయాలోనని ఆందోళనకు దిగామన్నరు. ఈ విషయమై.. ఫలితంగా అధికారుల దృష్టికి తమ సమస్య వెళ్లడంతో స్థానిక ఎంపీడీఓ లక్ష్మణ్ ఫోన్ ద్వారా మాట్లాడి తాగు నీటి సమస్యను తీరుస్తామని అన్నారు. దీంతో కాలనీవాసులు నిరసనను విరమించారు. సమస్య పరిష్కరం కాకపోతే మళ్లీ రోడ్డెక్కుతామని స్పష్టం చేశారు. కాగా, ఈ విషయమై.. 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా ఎంపీడీఓను వివరణ కోరగా.. మిషన్ భగీరథ నీటి సరాఫరాలో అంతరాయం ఏర్పడడం వల్ల సమస్య ఏర్పడిందని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించి తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారిస్తామని పేర్కొన్నారు.

కార్మికుల పొట్టకొడుతున్న జీవోను రద్దు చేయాలి : సీఐటీయూ

తలమడుగు, మే 20 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక వర్గానికి నష్టం చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అన్ని రకాల చట్టాలను నిలిపి వేయాలని లేకుంటే భవిష్యత్తులో పెద్దఎత్తున ఐక్య ఉద్యమాల ద్వారా కేంద్ర ప్రభుత్వంతో తలపడేందుకు కార్మిక వర్గం సిద్ధమవుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక అధిపతులు, దోపిడీ వర్గాలకు కొమ్ము కాయడం కోసం కార్మికుల శ్రమను దోచి పెట్టాలని చూస్తోందని ఆరోపించారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, రమణ, పద్మ, శోభ, అనసూయ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.